క్లుప్తంగా

బంద్‌కు సహకరించండి

తాండూరు టౌన్: అయోధ్యలో రామమందిరం ,బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 22వ తేదీన తాండూరు పట్టణంలోని వ్యాపారులు స్వచ్ఛంద బంద్‌కు సహకరించాలని గోశాల సేవా సమితి తాండూరు అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి కోరారు. 22న ప్రతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని, ఎల్‌ఈడీ తెరలపై అయోధ్యలో జరిగే ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోశాల ప్రధాన కార్యదర్శి పటేల్ విజయ్, కోశాధికారి ఓం ప్రకాశ్, పలువురు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దేవనూరు అధ్యక్షుడిగా సూర్యప్రకాశ్



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

యాలాల: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా దేవనూరు గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ సమక్షంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధికార ప్రతినిధిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా నరేశ్, రాములు, ప్రధాన కార్యదర్శిగా నవీన్, కార్యదర్శులుగా నర్సింహులు, సాయిలు, కోశాధికారిగా రాంచందర్, ప్రచార కార్యదర్శులుగా భరత్, నరేందర్, సలహాదారుడిగా కృష్ణ, సభ్యులుగా పకీరప్ప, బలరాం, మల్లేశం, రాజును ఎన్నుకున్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

ఎస్ఐ, రవిగౌడ్



దోమ: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇంట్లోని విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఎస్ఐ రవిగౌడ్ సూచించారు. ఊరికి వెళ్లే ముందు పక్కవారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్లు, బైక్‌ల తాళాలు దగ్గరలో ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా ఇంటి పరిసరాల్లో కనిపిస్తే 100కి ఫోన్ చేయాలని పేర్కొన్నారు. పోలీసులకు ప్రజలు సహకరిస్తే చోరీలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

వైభవంగా బోనాలు



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని ఇందనూర గ్రామంలో శుక్రవారం ఊరడమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండగకు ముందు వచ్చే శుక్రవారం రోజున ప్రతి ఏడాది అమ్మవారికి బోనాల సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. బాజా భజంత్రీలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా బోనాలతో వచ్చి.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తమను చల్లంగా చూడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ ఆడుతున్న శ్రీనివాస్ నాయక్

దోమ: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లితండాలో క్రికెట్ టోర్నమెంట్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ప్రతిభను కనబర్చాలన్నారు.

విజేతలకు బహుమతులు



ముగ్గులు వేస్తున్న చిన్నారి

కొడంగల్: పట్టణంలోని ఓ పాఠశాలలో చిన్నారులు శుక్రవారం ముగ్గులు వేసి బహుమతులు అందుకున్నారు. రంగు రంగుల రంగవల్లులతో ఆహ్వానితుల మెప్పు పొందారు. ఉత్తమ రంగవల్లులకు బహుమతులు అందజేశారు.

రెండో విడత ఎప్పుడో?

అటకెక్కిన గొర్రెల పంపిణీ పథకం

- మలి విడుతపై నీలినీడలు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు



మోమిన్‌పేట: కులవృత్తులను ప్రోత్సహించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017–18లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గొల్లకురుమల ఆర్థికాభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని అందరూ భావించారు. మొదటి విడుతలో లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. రెండో విడుతపై నీలినీడలు అలముకున్నాయి. అర్హులు గొర్రెల కోసం కలెక్టర్ ఖాతాలో డిపాజిట్లు కూడా చేశారు. కానీ పంపిణీకి అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. కలెక్టర్ ఖాతాలో తమ వాటాను జమ చేసి ఎనిమిది నెలలు దాటినా ఇప్పటికీ పంపిణీ చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో లబ్ధిదారుల్లో మరింత ఆందోళన మొదలైంది. ఇంతకూ ఈ పథకాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందా..? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎదురు చూపులు..

2017లో మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 19 గొల్ల, కురుమ సంఘాలను ఏర్పాటు చేశారు. అందులో 1,200 మంది లబ్ధిదారులు సభ్యులుగా చేరారు. అప్పట్లో 600 మందికి గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. మిగిలిన 600 మందికి రెండవ విడతలో పంపిణీ చేయాలని లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలకు ఒక విత్తన పొటేలు ఉంటుంది. స్థానికంగా లభించే జీవాలు కాకుండా ఇతర రాష్ట్రాలు నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో ఒక యూనిట్ విలువ రూ.1.25లక్షలు కాగా.. అందులో ప్రభుత్వం వాటా 75 శాతం (93,750) రాయితీ ఇస్తుండగా.. మిగతా 25 శాతం లబ్ధిదారులు చెల్లించాలని గత ప్రభుత్వం నిబంధన పెట్టింది. అయితే ఎన్నికలకు ముందు యూనిట్ ధరను బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1.75లక్షలకు పెంచింది. అందులో లబ్ధిదారుని వాటా రూ.43,750 వేలు.. కాగా మిగతా మొత్తం ప్రభుత్వం పూర్తి సబ్సిడీగా ఇస్తుందని అప్పట్లో ప్రకటించారు. 600 మంది తమ వాటాను చెల్లించాలని అధికారులు తెలిపారు. ఎన్నికల సమయం కావడంతో తప్పని సరిగా వస్తుందనే ఆశతో జిల్లా కలెక్టర్ ఖాతాలో ఒక్కొక్కరు రూ.43,750 జమ చేశారు. జమ చేసి ఎనిమిది నెలలు కావస్తున్న ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ నెలలో 36 మందికి గొర్రెలను పంపిణీ చేశారు. మిగతా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని కోరుతున్నారు.

పిలుపు రాలేదు

రెండవ విడత గొర్రెలను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో నా వాటా కింద రూ.43,750 కలెక్టర్ ఖాతాలో జమ చేశాను. ఎనిమిది నెలలు దాటినా ఇప్పటికీ అధికారుల నుంచి పిలుపు రాలేదు. అప్పులు చేసి చెల్లించాను. గతంలో డీడీలు తీయడం వలన తిరిగి డబ్బులు తీసుకొనే అవకాశం ఉండేది. ఇప్పుడు కలెకర్ ఖాతాలో జమచేయడం వలన తిరిగి తీసుకొనే అవకాశం లేకుండా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలి.

– పెద్దగొల్ల రమేశ్, మల్లారెడ్డి గూడెం

36 మందికి పంపిణీ చేశాం



రెండవ విడతలో 36 మందికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వారికి గొర్రెలు కొనుగోలు చేయించాం. 297 మంది కలెక్టర్ ఖాతాలో తమ వాటా జమ చేశారు. లబ్ధిదారులు తమ వాట సొమ్మును తిరిగి తీసుకొవాలని సూచించాం. కానీ కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గొర్రెలను పంపిణీ చేస్తుందనే ఆశతో లబ్ధిదారులున్నారు.

– గీత, పశువైద్యాధికారి, మోమిన్‌పేట

పొదుపు.. భవితకు మదుపు



తపాలా సేవలపై వివరిస్తున్న సిబ్బంది

యాలాల: గ్రామీణ తపాలా పొదుపు ఖాతాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, పొదుపు.. భవితకు మదుపని తాండూరు రీజియన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్‌రెడ్డి, యాలాల సబ్ పోస్ట్‌మాస్టర్ షేక్ ఫిరోజ్ బాబా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముద్దాయిపేటలో గ్రామీణ తపాలా సేవలపై గ్రామ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్‌తో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. సుకన్య సమృద్ధి, రికరింగ్ డిపాజిట్లు, ఐపీపీబీ ఖాతాల గురించి వివరించారు. సుకన్య సమృద్ధి పథకంతో మహిళలకు కలిగే లాభాలను తపాలా సిబ్బంది మహిళలకు వివరించారు. జీవిత బీమాలో చేరితే కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పగిడియాల బీపీఎం అరుణ్ కుమార్, తిమ్మాయిపల్లి బీపీఎం ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి



వినతిపత్రం అందజేస్తున్న శంకర్‌నాయక్

కుల్కచర్ల: గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను త్వరగా విడుదల చేయాలని ఫైనాన్స్ కమిషనర్ స్మితా సభర్వాల్‌ను కుల్కచర్ల మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయక్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో స్మితా సభర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా జనరల్ ఫండ్ రాకపోవడంతో కార్మికులు, జీపీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బిల్లుల మంజూరు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే యువతకు భవిష్యత్తు

ఆర్డీఓ విజయకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

పరిగి: ఓటు యువత భవిష్యత్తును నిర్ణయిస్తుందని, సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు వీలుంటుందని ఆర్డీఓ విజయకుమారి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా ఓటరుగా నమోదుతో పాటు ఓటరు జాబితా సవరణకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరికి హక్కు అని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కొరారు. ప్రతి బూత్‌లో బీఎల్ఓలను నియమించి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామాల్లో బీఎల్ఓల ద్వారా ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల 'అపూర్వ' కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న విద్యాభారతి స్కూల్ పూర్వ విద్యార్థులు

తాండూరు టౌన్: రెండు దశాబ్దాల తర్వాత ఆ విద్యార్థులంతా ఒక్క దగ్గర చేరారు. పాఠశాలలో చిన్ననాటి తీపి గుర్తులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. దండించిన ఉపాధ్యాయులకు దండలతో ఘనంగా సన్మానించారు. తాండూరు పట్టణంలోని విద్యాభారతి స్కూల్‌లో 2001–02 విద్యా సంవత్సరంలో పదవ తరగతి అభ్యసించిన విద్యార్థులంతా స్థానిక దుర్గా హోటల్‌లో సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభులింగం, ఉపాధ్యాయులు నారాయణ గౌడ్, శ్రీనివాస్, భాస్కర్, ఉదయ్, హన్మంతు, అంతారం లలిత, శివలీల, గంగమ్మ, స్వరూప పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

దోమ: మండల పరిధిలోని జిల్లా పరిషత్ మోత్కూర్ పాఠశాలలో 2007–08 విద్యాసంవత్సరంలో పదవ తగరతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రకళ, ఎన్టీఆర్ శంకర్,తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

షాబాద్: ముత్యాల ముగ్గుల పోటీలను షాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ సతీమణి జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. మొదటి బహు మతి లావణ్య, గాయత్రిలకు రూ.5వేలు నగదు, రెండవ బహుమతి బోడ శ్వేతకు రూ.3వేలు, మూడవ బహుమతి జంగం లలితకు రూ.2వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుబ్రమణ్వేశ్వరి,అనితా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

❖ క్రికెట్ కిట్లు అందజేత

తాండూరు రూరల్: మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. వివేకానంద సంఘం గ్రామ అధ్యక్షుడు ఉప్పరి రాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి యువకులు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం యువకులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, ఉప్పరి నర్సింహులు, తలారి శ్రీశైలం, ఎర్ర శ్రీను, వడ్ల నాగరాజు, వెంకటప్ప ఉన్నారు.

❖ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

యాలాల: మండల పరిధిలోని దేవనూరు గ్రామంలో శుక్రవారం రేణుక ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, హన్మంతు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

❖ మాక్ డ్రిల్

తాండూరు టౌన్: నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదం, వరద, భూకంపాల వంటి విపత్కర పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్ చేపట్టే రక్షణ చర్యలపై మాక్ డ్రిల్ చేసి చూపించారు. ప్రజలు విపత్తు సమయాల్లో సంయమనాన్ని పాటించి, కొన్ని నిబంధనలు పాటిస్తే నష్టాలను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ అడిషనల్ ఎస్పీ దామోదర్ సింగ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లినాథప్ప, విద్యార్థులు, అటవీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

❖ మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

దోమ: యువత మహనీయుల ఆశయాలను కొనసాగించాలని భారత ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్ కోరారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో ఆ గ్రామ యువకులతో కలసి ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి జీజాబాయి 426వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ ముక్తి మోర్చా మండల అధ్యక్షుడు రవీందర్ నాయక్, దిర్సంపల్లితండా డిప్యూటీ సర్పంచ్ మోతిలాల్ నాయక్, జీవీఎస్ మండల అధ్యక్షుడు సునీల్ నాయక్, భారత విద్యార్థి మోర్చా జిల్లా నాయకులు గణేశ్ నాయక్, సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

❖ ప్రతి దరఖాస్తు రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాలి

వికారాబాద్ అర్బన్: ప్రజాపాలనలో వచ్చిన ప్రతి దరఖాస్తును భద్రపర్చడంతో పాటు, రిజిస్టర్‌లో నమోదు చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుభాషిణి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారి తరుణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలోని డాటాఎంట్రీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్లో నమోదు చేసిన విధానాన్ని పరిశీలించారు.

❖ శబరిమలకు బయలుదేరిన స్వాములు

పెద్దేముల్: అయ్యప్ప మాల ధరించిన స్వాములు శబరిమల బయలుదేరారు. శుక్రవారం పెద్దేముల్ శంభులింగేశ్వర ఆలయంలో ఇరుముడి కట్టుకొని, పూజలు చేశారు. 41రోజుల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు శబరిమలకు వెళ్లారు.

❖ సెల్‌ఫోన్ రికవరీ

పూడూరు: పూడూరు మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ మున్నా సెల్‌ఫోన్ పోగొట్టుకోగా.. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి శుక్రవారం బాధితుడికి అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్‌లను రికవరీ చేసేందుకు సీఈఐఆర్ పోర్టల్ ఎంతో దోహదపడుతోందని ఎస్ఐ గిరి తెలిపారు.

❖ గోదాంలు అద్దెకు

పెద్దేముల్: పెద్దేముల్ మండల తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కొత్తగా నిర్మించిన గోదాంలను అద్దెకు ఇస్తామని తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, సీఈఓ రాజమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తట్టెపల్లి గ్రామంలో 1,000 మెట్రిక్ టన్నుల గోదాం, నాగులపల్లి గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల గోదాములను మూడు నెలల క్రితం కొత్తగా నిర్మించడం జరిగిందన్నారు. ఆసక్తి గల వ్యాపారస్తులు, రైతులు ఎవరైనా రైస్ మిల్లు, లేదా దాల్ మిల్లు కోసం అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

❖ సర్టిఫికెట్ల పరిశీలన

వికారాబాద్ అర్బన్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఈఈసెట్ 2023–25 ఏడాది కోర్సులో చేరడానికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు హాజరుకానీ.. వారికి మరోసారి అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామచారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న డైట్ కళాశాల వికారాబాద్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. 18 నుంచి 22వ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, 25న సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. 26 నుంచి 29వ తేదీలోపు ఫీజు చెల్లించి అలాట్‌మెంట్ లెటర్‌తో సీటు అలాట్ అయిన కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించి రిపోర్ట్ చేయాలన్నారు.

❖ కార్యకర్తలకు న్యాయం చేయాలి

యాలాల: పదేళ్లుగా అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని, పార్టీ గెలుపునకు కష్టపడ్డ కార్యకర్తలను, యువకులకు అధిష్ఠానం న్యాయం చేయాలని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ నాయకులు వీరేశం, శ్రీకాంత్, మదన సింహారెడ్డి కోరారు. నగరంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు క్షేత్రస్థాయిలో పనిచేసిన కార్యకర్తలు, నాయకులు, యువకులకు సముచిత స్థానం కల్పించి న్యాయం చేయాలని సీఎంను కోరామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతుందని ధీమావ్యక్తం చేశారు.



యాలాల: వివేకానంద విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కుల్కచర్ల: స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



బహుమతులు ప్రదానం చేస్తున్న వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి



తాండూరు: వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



పరిగి: వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

స్ఫూర్తి ప్రదాత

మహనీయుడు వివేకానందుడు

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు
- నివాళులర్పించిన నాయకులు

తాండూరు టౌన్: స్వామి వివేకానంద ధీశాలి దయాశీలి అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం తాండూరు పట్టణంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే పట్టణంలోని వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచానికి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



వికారాబాద్ అర్బన్: వివేకానందుడికి నివాళి అర్పిస్తున్న యజ్ఞ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు



దోమ: ఐనాపూర్‌లో..



తాండూరు: జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు



బంట్వారం: కోట్‌పల్లిలో..



పెద్దేముల్‌లో...



కొడంగల్ రూరల్: వివేకానంద జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న యువత



పూడూరు: వివేకానందుడి చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న నాయకులు